క్లుప్తంగా

బండలాగుడు పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న సూర్యనారాయణరెడ్డి

పాణ్యం: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో శుక్రవారం బండలాగుడు పోటీలు ప్రారంభమయ్యాయి. పాణ్యం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి పోటీలను ప్రారంభించారు. పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి వృషభాలను తీసుకొచ్చారు. పోటీలను తిలకించేందు చుట్టు పక్కల గ్రామాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. హోరాహోరీగా పోటీలు సాగాయి. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లకృష్ణయ్య, నాయకులు సత్యాలు, రమణ, వెంకట, చందమామ బాబు, కో–ఆప్షన్ సభ్యుడు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం


గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోడుమూరు రూరల్: గ్యాస్ వినియోగం, ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ మహబూబ్ దౌలత్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రైవేట్ ఆస్పత్రుల వైద్య సిబ్బందికి శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. పెద్ద భవనాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే ఎట్టి పరిస్థితుల్లో లిఫ్ట్ ఉపయోగించకూడదని తెలిపారు. మెట్ల మార్గం ద్వారానే బయటకు వెళ్లాలన్నారు. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే రోగులను ఎలా కాపాడాలి.. ర్యాంపు ద్వారా ఎలా బయటకు తీసుకెళ్లాలి అన్న వాటిపై అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.

పాణ్యంలో ఓటింగ్ శాతం పెంపుపై దృష్టి

● పాణ్యం ఆర్వో నారపురెడ్డి మౌర్య



కర్నూలు(సెంట్రల్): ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య అన్నారు. శుక్రవారం సాయంత్రం మినీ కాన్ఫరెన్స్ హాలులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు పోలింగ్ స్టేషన్ల లోకేషన్ల మార్పు కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపామని, ఇంతవరకు అనుమతులు రాలేదన్నారు. పాణ్యం నియోజకవర్గంలో ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ కోసం 3,488 మంది, హోం ఓటింగ్ కోసం 85 ఏళ్లు నిండిన వారు, తీవ్ర అనారోగ్యంతో బాధపడే వారు 169 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. కల్లూరులో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఫారం–6 కింద నిర్దేశిత గడువులోపు దాదాపు 3 వేల దరఖాస్తులు వచ్చాయని, వీటిని పరిశీలించి ఏప్రిల్ 25వ తేదీన జాబితాలో చేర్చుతామన్నారు. కాగా, పోస్టల్ బ్యాలెట్ కోసం ఏప్రిల్ 25వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని, ఎవరైనా సరే తమ తమ ఆర్వో కార్యాలయాల్లో ఫామ్–12 ఇచ్చి బ్యాలెట్ తీసుకోవచ్చన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామని, నియోజకవర్గంలో 299 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ పెట్టనున్నట్లు వెల్లడించారు. ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్‌లైన్ల మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు. ఓల్డ్ టౌన్ సెక్షన్ పరిధిలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఏరియా, గీతా మందిర్ ప్రాంతం, దండిగేరి, ఉస్మానియా కళాశాల రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా 11 కేవీ దీపక్ తేజా, రోజా, సాయిబాబా, బుధవారపేట ఫీడర్ల పరిధిలోని ధర్మాపేట, నెహ్రూనగర్, రోజ స్ట్రీట్,చల్లా కాంపౌండు, ప్రకాశ్‌నగర్, శ్రీనివాస్ నగర్, సంకల్‌బాగ్, ఎన్ఆర్ పేట, కొత్తపేట రైతుబజార్ ఏరియా, జిల్లా కోర్టు ఏరియా, చెట్టుకింద బడి, డాక్టర్ గోపిచంద్ డీటీఆర్, హబీబ్ ముబారక్ నగర్, ముఖద్వారం, మారెమ్మ టెంపుల్, బంగి అనంతయ్య స్ట్రీట్, విరూపాక్షయ్య తోట, కల్లుపెంట ఏరియాల్లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు.


భారీగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తల నడుమ నామినేషన్ వేయడానికి వెళ్తున్న ఆదిమూలపు సతీష్


కోలాటం ఆడుతూ సందడి చేస్తున్న యువతులు

విజయీభవ

● అట్టహాసంగా కోడుమూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ నామినేషన్
● తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు
● తొలుత తల్లిదండ్రులు, అంబేడ్కర్ విగ్రహానికి నివాళి
● కర్నూలు వైఎస్సార్ సర్కిల్ నుంచి భారీ ర్యాలీ
● హాజరైన కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోట్ల హరిచక్రపాణిరెడ్డి
● మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, ఎం.మణిగాంధీ


పార్టీ నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ఆదిమూలపు సతీష్


నామినేషన్ కార్యక్రమానికి గూడూరు నుంచి తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలు సిటీ: వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ శుక్రవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. ఉదయం సతీష్ తన ఇంటి దగ్గర తల్లిదండ్రులు జార్జ్, థెరిస్సామ్మ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత పాత బస్టాండ్ వద్దనున్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోట్ల హరిచక్రపాణిరెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్ రెడ్డి, ఎం.మణిగాంధీతో కలిసి పూల మాలలు వేశారు. అనంతరం భారీగా తరలివచ్చిన నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి వైఎస్సార్ సర్కిల్ నుంచి ర్యాలీగా నామినేషన్ వేసేందుకు కర్నూలు ఆర్డీఓ ఆఫీస్‌కు బయలుదేరారు. పార్కు దగ్గర ఆయన సతీమణి డాక్టర్ స్టెల్లా సతీష్ గుమ్మడికాయతో దిష్టి తీశారు. తర్వాత సతీష్, వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు ప్రత్యేక వాహనం ఎక్కి అభివాదం చేసుకుంటూ ముందుకు కదిలారు. కార్యకర్తలు కేరింతల నడుమ చిన్న పార్కు, మహవీర్ సర్కిల్, ఎక్సైజ్ ఆఫీస్ మీదుగా పాత కంట్రోల్ రూమ్ వరకు, అక్కడి నుంచి గొలిగేరి మీదుగా రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ సాగింది. అక్కడ పోలీసులు ఏర్పాటు చేసిన ప్రత్యేక బారికేడ్ల నుంచి నామినేషన్ వేసేందుకు ఆదిమూలపు సతీష్‌తో పాటు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, స్టెల్లా సతీష్, అభ్యర్థికి ప్రతిపాదించే వారితో కోడుమూరు నియోజకవర్గ (కర్నూలు ఆర్డీఓ ఆఫీస్) రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఆర్ఓ ఎం.శేషిరెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

● కోడుమూరు రూరల్: వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ నామినేషన్ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కర్నూలుకు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. కులమతాలు, పార్టీలకతీతంగా ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అందరికీ మేలు చేస్తున్న జగనన్నను మరోసారి ఆశ్వీరదించి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలనిపిలుపునిచ్చారు.

● సి.బెళగల్: మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కర్నూలుకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. నామినేషన్ సందర్భంగా పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది. సుమారు రెండు వేల మంది కర్నూలుకు వెళ్లారు. నాయకులు నాగేశ్వరరెడ్డి, ఎస్ఎం బాషా, మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, హారున్, రామకృష్ణ, రవిప్రకాష్‌రెడ్డి, తులసిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గూడూరు: నామినేషన్ పర్వానికి పట్టణం నుంచి భారీగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు, పట్టణ కమిటీ కన్వీనర్ జే.ఆబేల్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు,కార్యకర్తలు 20 వాహనాల్లో తరలివెళ్లారు.




కోడుమూరు: కోడుమూరు నుంచి తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సి.బెళగల్ నాయకులు, సి.బెళగల్ మండలం ఈర్లదిన్నె గ్రామం నుంచి వెళ్తున్న నాయకులు


మా నమ్మకం నువ్వే జగన్ అంటున్న వృద్ధుడు

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ



వైఎస్సార్‌సీపీలో చేరిన ఓర్వకల్లుకు చెందిన టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, లొద్దిపల్లె వాసులతో ఎమ్మెల్యే కాటసాని

● ఓర్వకల్లు మండలంలో ఖాళీ అవుతున్న టీడీపీ

కల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఇతర పార్టీల నుంచి వలసలు కొనసాగుతున్నాయి. పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు మండలంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరికలు పెరుగుతున్నాయి. ఓర్వకల్లు మండల వ్యాప్తంగా టీడీపీ ఖాళీ అవుతుండగా వైఎస్సార్‌సీపీ గతంలో కన్నా బలపడుతోంది. శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహంలో ఓర్వకల్లు గ్రామానికి చెందిన 50 టీడీపీ కుటుంబాలు సర్పంచ్ నాగేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడ్, నాగలింగేశ్వర్‌రెడ్డి, కురువ పెద్దయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కాటసాని వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కురువ ఎల్లప్ప, షాషావలి, ఖాజా హుస్సేన్, పింజరి బాకర్, దండిగల అల్లబాబు (వజ్రం) కుటుంబ సభ్యులు, మొల్ల గఫూర్ మియ్య, సదక్ హుస్సేన్, మహ్మద్ హుస్సేన్, సిలార్, పెద్ద చిరంజీవి, చిన్న చిరంజీవి, దుబ్బ స్వాములు, ప్లంబర్ కృష్ణ, భాస్కర్, వడ్డె నాగేశ్వరరావు, బోయ మధు, హోటల్ వలి, మజీద్, గౌండ ఖలీల్, ఇమ్మామ్ హుస్సేన్, మహమ్మద్ రఫీ, ఆటో ప్రతాప్‌తో పాటు 50 కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏదైనా హామీ ఇచ్చారంటే తప్పకుండా చేస్తారని తెలిపారు. పార్టీలు, కులమతాలు, రాజకీయాలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. అందుకే ఇతర పార్టీల నుంచి తమ పార్టీలోకి భారీగా చేరికలు ఉంటున్నాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు భరత్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, రాజమోహన్‌రెడ్డి విజయభాస్కర్‌రెడ్డి అనిల్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

లొద్దిపల్లె గ్రామం నుంచి 50 కుటుంబాలు

లొద్దిపల్లె గ్రామానికి చెందిన 50 టీడీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామ సర్పంచ్ పుష్పమ్మ, ఎంపీటీసీ నాగగిరీష, ప్రభాకర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, రాజేశ్వరరెడ్డి, వీరాభద్రరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో నారాయణరెడ్డి, లింగన్న, నారాయణ, నడిపి స్వాములు, రఘు, పి.రాముడు, సుంకన్న, కిషోర్, యోహాను, జేమ్స్ ఉన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను సీఎంగా చేసుకోవాలన్నారు.

చేరికల్లోనూ టీడీపీ నాటకాలు

● గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి


గడివేములలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గడివేముల: వైఎస్సార్‌సీపీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక గడివేముల మండల టీడీపీ నాయకులు నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో గురువారం గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వారంతా గోడమీద పిల్లులని.. వారు ఏనాడూ వైఎస్సార్‌సీపీలో లేరని తెలిపారు. పట్టుమని పదిమంది లేకపోయినా 100 కుటుంబాలు చేరాయంటూ ప్రచారం చేసుకోవడం టీడీపీ మండల నాయకుల దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. రాజకీయ వ్యభిచారానికి మారుపేరులా ఆ పార్టీ నేతలు తయారయ్యారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. చంద్రబాబు పాలనంతా కరువుమయమన్నారు. ఆ పార్టీ విధానాలు నచ్చకే చాలా మంది తమ పార్టీలోకి వస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఏళ్ల సమస్యలకు పరిష్కారం చూపామని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. జగనన్న పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఆయనతో పాటు ఉపసర్పంచ్ బాలచెన్ని, ఎంపీటీసీ సభ్యుడు వంగాల మహేశ్వరరెడ్డి, నాయకులు దేశం నాగేశ్వరరెడ్డి, ఆర్ఐ సంజీవరెడ్డి, వెంకటేశ్వర్లు, సీవీ రమణయ్య పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


బండ లాగుతున్న ఎద్దులు

ఓర్వకల్లు: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో శుక్రవారం జాతీయస్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. స్థానిక రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 15 జతల ఎద్దు పాల్గొన్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు శ్రీరెడ్డి చిన్నారెడ్డి తెలిపారు. పసుపుల, రుద్రవరం గ్రామాలకు చెందిన ఎల్లగౌడు వృషభాలు నిర్ణీత సమయానికి 4,103 అడుగుల దూరం లాగి మొదటి బహుమతిగా రూ.50 వేలు దక్కించుకున్నాయి. అలాగే ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సుధాకర్ వృషభాలు 3,900 అడుగులు లాగి రెండో బహుమతిగా రూ.40 వేలు దక్కించుకున్నాయి. కలుగొట్ల రమేష్ నాయుడు, జమ్మిచెట్టు వెంకటేష్ (విడి జత) వృషభాలు 3,600 లాగి మూడో బహుమతిగా రూ.30 వేలు గెలుచుకున్నాయి. అలాగే పసుపుల, రుద్రవరం గ్రామాలకు చెందిన గోపాల్ గౌడ్, పంచలింగాలకు చెందిన షబ్బీర్ (విడి జత) వృషభాలు 3,326 అడుగులు లాగి నాల్గో బహుమతిగా రూ.25 వేలు, ఐదో స్థానంలో వెంకటగిరి గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి వృషభాలు రూ.20 వేలు, ఆరో స్థానంలో జెక్కిలేరు రషీద్ బాషా వృషభాలు రూ.15 వేలు దక్కించుకున్నాయి. పోటీలను మాజీ సర్పంచ్ శ్రీరెడ్డి చెన్నారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కురువ నాగరాజు, జేసీబీ అంజి, శివాంజనేయులు, లక్ష్మీదేవమ్మ, పెద్ద నాగమద్దయ్య, రాశిక శివాంజనేయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

● మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మి
● గ్రామాల్లో నీటి సమస్యపై చర్చించిన అధికారులు, ప్రజాప్రతినిధులు


సమస్యలపై చర్చిస్తున్న సభ్యులు

పాణ్యం: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాల్లో తాగునీటి సమస్యలను గుర్తించి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్య ఉంటే సర్పంచ్, ఎంపీటీసీలను సమన్వయం చేసుకుని పరిష్కరించాలన్నారు. తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఉన్న నీటి వనరులను ఉపయోగించుకోవాలన్నారు. ఎండ తీవ్రతపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. గ్రామాల్లో మైక్‌ల ద్వారా లేదా డండోరా వేసి వడదెబ్బపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్‌లు , ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సజీవ సమాధి కలకలం

కల్లూరు: మండల పరిధిలోని లక్ష్మీపురంలో శుక్రవారం సాయంత్రం సజీవ సమాధి వదంతులు కలకలం రేపాయి. గ్రామంలో కొన్నేళ్ల నుంచి ఓ స్వామి ఉంటున్నాడు. కొందరు ఆయన్ను ఆరాధిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి శుక్రవారం వచ్చిన కొందరు ఆయన్ను సజీవ సమాధి చేస్తున్నారని వదంతులు రావడంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోవడంతో వచ్చిన వారు పరారయ్యారు.

ప్రజల పక్షాన పోరాటం

కల్లూరు: తాము ప్రజల పక్షాన వారి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ఇండియా కూటమి పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గౌస్ దేశాయ్ అన్నారు. శుక్రవారం కల్లూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఓటు వేయాలని అభ్యర్థించారు. శరీన్‌నగర్, కల్లూరు ప్రాంతాల్లో విద్యార్థి యువజన కార్మిక సంఘాల కార్యకర్తలు, ప్రజానాట్యమండలి సభ్యులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు అండగా నిలవండి

● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రజల మేలుకోరే వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం చెట్లమల్లాపురం, నాయకల్లు, కొంగనపాడు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. మే 13న జరగనున్న ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో పేదల బతుకులు మారాయన్నారు. పేదలందరి సంక్షేమం కోసం నవరత్నాల పథకాలు అమలు చేశామన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని తెలిపారు. పొరపాటున టీడీపీ వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయని.. ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. తమ పాలనలో గ్రామాల్లో ఇంటింటికీ కొళాయి కనెక్షన్, మురుగు కాలువలు నిర్మించామని చెప్పారు.

అబద్ధాల కోరు చంద్రబాబు

టీడీపీ అధినేత చంద్రబాబు అబద్ధాల కోరు అని ఎమ్మెల్యే కాటసాని విమర్శించారు. 14 ఏళ్ల టీడీపీ పాలనకు ఈ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను గమనించాలని కోరారు. 2014 ఎన్నికల్లో పొదుపు సంఘాల మహిళలు, రైతులకు రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశారన్నారు. రుణాలు మాఫీ కాకపోవడంతో అధిక సంఖ్యలో మహిళా సంఘాలు డీఫాల్టర్ల జాబితాలోకి వెళ్లాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పొదుపు సంఘాల రుణాలను నాలుగు దశల్లో మాఫీ చేశారన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు నవరత్నాల్లో భాగస్వాములను చేశారని తెలిపారు. కార్యక్రమంలో చెట్లమలాపురం సర్పంచ్ ఎస్.భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చంద్రారెడ్డి, కొంనగపాడు సర్పంచ్ సువర్ణమ్మ, నాయకులు కేశవరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, మండల నాయకులు పాల్గొన్నారు.